క్లుప్తంగా

280 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు



ఉయ్యూరు: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద విద్యార్థులకు శనివారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 280 మంది విద్యార్థులను పరీక్షించి 13 మంది విద్యార్థులకు దృష్టి లోపాలు ఉన్నట్లు గుర్తించారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ వివి రాజేష్‌కుమార్ కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020లో కంటి పరీక్షలు నిర్వహిస్తే ఎక్కువ మంది విద్యార్థుల్లో దృష్టి లోపాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ప్రస్తుతం 280 మంది విద్యార్థుల్లో 13 మందికి మాత్రమే సమస్య ఉందన్నారు. జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారం అందుతుందన్నారు. ఉపాధ్యాయులు సమర్థంగా విద్యార్థులు జగనన్న గోరుముద్దను తీసుకునేలా చర్యలు తీసుకోవటంతో విద్యార్థుల్లో ఆరోగ్యం మెరుగుపడిందన్నారు.

చదువుతో పాటు సామాజిక సేవ



పెనమలూరు: విద్యార్థులు సామాజికసేవలో పాల్గొనాలని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీన్ పాండురంగారావు అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం ఎన్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాండు రంగారావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సమాజసేవ చేయాలని సూచించారు. దీని వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ప్రతి ఏడాది అనేక సేవా కార్యక్రమాలు చేస్తుందన్నారు. భవిష్యత్తులోనూ విస్తృతం చేస్తామని పేర్కొన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ విభాగంలో ఉత్తమ సేవలు అందించిన ఈఈఈ విభాగం విద్యార్థి టి.నాగవెంకటహనుమంత్‌కు ఉత్తమ వలంటీర్ అవార్డు అందచేశారు.

మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దు

నున్న(విజయవాడరూరల్): విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రామ్ మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు అన్నారు. శనివారం వికాస్ కాలేజీలో మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం స్క్రీన్ ప్రాజెక్టర్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో విద్యార్థులు ఒక్కసారి ధూమపానం, మద్యం సేవించడం, గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఏకాగ్రతను కోల్పోయి మానసికంగా కుంగిపోవడం జరుగుతుందన్నారు. విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వికాస్ కాలేజీ ప్రిన్సిపాల్స్ బి.రమణ పి.ఎస్ శ్రీనివాసరావులు మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వికాస్ కాలేజ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి.శేఖర్‌రెడ్డి, మహిళా సంరక్షణ కార్యదర్శి వీణ, నవజీవన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ఉంగుటూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్-2023లో భాగంగా గన్నవరంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి ఆటల పోటీల్లో పెద అవుటపల్లి శ్రీసాయి శ్రీనివాస హైస్కూల్ విద్యార్థులు 45 మంది జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సాయిబాబా తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో క్రీడల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు శనివారం అభినందన సభ నిర్వహించారు. అండర్-14,17 బాలుర, బాలికల విభాగంలో ఖోఖో, షటిల్ పోటీలకు 20 మంది, రన్నింగ్, లాంగ్ జంప్, షార్ట్ పుట్ పోటీల్లో 25 మంది విద్యార్థులు ఎంపికయ్యారని వివరించారు. విద్యార్థులను విజేతలుగా తీర్చిదిద్దిన పీఈటీ గాంధీని అభినందించారు.

కుండపోత వర్షం

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్ జంక్షన్‌లో శనివారం సాయంత్రం కుండపోతగా వర్షం కురిసింది. దాదాపు నాలుగు గంటల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవటంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. స్థానిక విజయవాడ రోడ్డులో వర్షపు నీరు నిలిచిపోవటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది.

గణపతి బప్పా మోరియా...

కంకిపాడు: గణేష్ నవరాత్రులు గ్రామాల్లో వైభవంగా జరుగుతున్నాయి. ఊరూరా గణేష్ నిమజ్జనాలను భక్తులు అత్యంత భక్తితో నిర్వహిస్తున్నారు. గణపతి బప్పా మోరియా అంటూ కాలువలు, నదీపాయల్లో విఘ్ననాయకుడిని నిమజ్జనం చేస్తున్నారు. కంకిపాడు లాకురోడ్డులో నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపాన్ని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపించారు. రూ.10 వేలు విరాళాన్ని అందజేయించారు. ఈ సందర్భంగా నిర్వాహక ప్రతినిధులు ఎమ్మెల్యే పార్థసారథిని సత్కరించారు. అనంతరం అంకమ్మతల్లి గుడి సెంటరులో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని సందర్శించి స్వామి వారికి పూజలు చేయించారు. అన్నసంతర్పణను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, ఏఎంసీ వైస్‌చైర్మన్ మాదు వసంతరావు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ రామినేని రమాదేవి, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, ఏఎంసీ డైరెక్టర్ మరియబాబు, చింతల అప్పారావు, ఎం. సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

రూ.40 వేలు పలికిన కేసరపల్లి లడ్డు

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని పలు గ్రామాల్లో గణపతి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కేసరపల్లిలోని హేమదుర్గా జ్యూయల్ కౌంటిలో గత వారం రోజులుగా జరుగుతున్న గణపతి ఉత్సవాలు శనివారం ముగిశాయి. తొలుత స్వామివారి సన్నిధిలోని లడ్డూను వార్డు మాజీ సభ్యుడు రాజులపాటి శ్రీనివాసరావు, రజని దంపతులు రూ. 40,100కు వేలంలో దక్కించుకున్నారు. అనంతరం గణనాథుడిని ఏలూరు కాలువలో నిమజ్జనం చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, బిల్డర్ చలసాని సురేష్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కేసరపల్లిలోని శ్రీగంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద గణేష్ యువసేన ఆధ్వర్యంలో భక్తులకు అన్న సంతర్పణ చేశారు. కమిటీ అధ్యక్షురాలు జాస్తి రేణుక, సభ్యులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పార్థసారథిని సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

గ్రామాల్లో ఘనంగా గణేష్ ఉత్సవాలు.

పెనమలూరు: మండల పరిధిలో వినాయక ఉత్సవాలు అత్యంత వైభవంగా చేస్తున్నారు. దాదాపు 80 వినాయకుడి పందిళ్లు వేసి విగ్రహాలు భక్తులు ఏర్పాటు చేశారు. ప్రతి రోజు వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పెనమలూరు 1వ వార్డులో గత 15 సంవత్సరాలుగా వినాయకుడి ఉత్సవాలు స్థానికులు ఘనంగా చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివరం రాత్రి గణనాథుడి మండపంలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణం, సుదర్శన హోమం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పల్లిపేట వినాయకుడి విగ్రహం వద్ద శ్రీనివాస కల్యాణం ఘనంగా చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పోరంకి గంగానమ్మ గుడి ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం సందర్భంగా ఆదివారం నిమజ్జన కార్యక్రమం ఉండటంతో భక్తులకు బొర్రా యూత్ కమిటీ అన్నసమారాధన నిర్వహించారు. దాదాపు మూడు వేల మంది భక్తులు పాల్గొన్నారు. కానూరు యాదవుల బజార్‌లో గణనాథుడికి స్థానిక యువత ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లో శనివారం దాదాపు 16 వినాయకుడి విగ్రహాలు నిమజ్జనం చేశారు.

నేడు భారీగా వినాయక నిమజ్జనం...

మండలంలో ఆదివారం దాదాపు 50 వినాయక విగ్రహాలు నిమజ్జనం చేస్తున్నారని సీఐ వి.శ్రీనివాసరావు తెలిపారు. నిమజ్జన సమయంలో భక్తులు పోలీసులతో సహకరించాలని సూచించారు. ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బంది రాకుండా చూడాలన్నారు. నిమజ్జన సమయంలో నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

కోలాహలంగా గణేష్ నిమజ్జనాలు

ఉయ్యూరు: గణేష్ నిమజ్జన ఊరేగింపులు కోలాహలంగా సాగుతున్నాయి. డప్పు వాయిద్యాల జోరు, డీజేల సందడితో భక్తజనం గణేష్ మహరాజ్‌కీ జై అంటూ శనివారం వాడవాడలా ఊరేగింపు నిర్వహించి గణనాథుడిని భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఉయ్యూరు పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయక నిమజ్జన ఊరేగింపులు వైభవంగా జరిగాయి. సుందరమ్మపేటలో భారీ అన్న సంతర్పణ నిర్వహించారు. కౌన్సిలర్లు పైలా శ్రీనివాసరావు, కూరాడ వెంకటలక్ష్మి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలువ కట్టపై ఊరేగింపులో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యురాలు అడపాక ఆదిలక్ష్మి, నాయకుడు అడపాక రాంబాబు పాల్గొన్నారు. ఎంకె డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఎకో ఫ్రెండ్లీ వినాయక నిమజ్జన ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డైరెక్టర్ ఎంకే బాబు పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.



ఉయ్యూరులో గణేష్ నిమజ్జన ఊరేగింపు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక హనుమాన్‌నగర్‌లో గత ఐదు రోజులుగా జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాల్లో విశేష పూజలు అందుకున్న గణనాథుడి విగ్రహాల నిమజ్జనం శనివారం ఘనంగా నిర్వహించారు. లడ్డూ ప్రసాదం వేలం ద్వారా విక్రయించారు. 11 కేజీల లడ్డూ ప్రసాదాన్ని వడ్డే గోపి రూ.15 వేలకు చేజిక్కించుకోగా, 9 కేజీల లడ్డూ ప్రసాదాన్ని పుప్పాల వెంకట సుబ్బారావు రూ.9 వేలకు సొంతం చేసుకున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై వినాయక విగ్రహాన్ని తీన్‌మార్ డప్పువాయిద్యాల నడుమ భారీ ఊరేగింపుగా తీసుకువెళ్లి పెరికీడు వద్ద కృష్ణా-ఏలూరు కాలువలో నిమజ్జనం చేశారు.



పెనమలూరులో లక్ష్మీనరసింహస్వామి కల్యాణం చేస్తున్న భక్తులు



పోరంకి గంగానమ్మ సన్నిధిలో అన్నసమారాధన చేస్తున్న భక్తులు



కానూరు యాదవుల బజార్‌లో వినాయకుడికి పూజలు చేసిన యువత

ఉత్సాహంగా ఆటల పోటీలు

కంకిపాడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని మంతెన జెడ్పీ పాఠశాలలో ఆటల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. నియోజకవర్గ స్థాయి జట్ల ఎంపిక పోటీలు శనివారం నిర్వహించారు. ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ విభాగాల్లో బాలబాలికలకు సీనియర్, జూనియర్స్ కేటగిరీలో పోటీలు నిర్వహించారు. నియోజకవర్గంలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల నుంచి 160 మంది క్రీడాకారులు ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా కేటగిరీల్లో తమ సత్తాచాటారు. ఖోఖో, బాల్‌బ్యాడ్మింటన్, టెన్నికాయిట్‌లలో సత్తా చాటిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులను ఎంఈఓ కె.ఎస్.వి. ప్రసాద్ అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తుందని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.రత్నకుమార్, విశ్రాంత పీడీ ఎం.బాలప్రసాద్, టి.కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఆటల పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు జీవీ రమణ, ఎం. హరిగోపాల్ పర్యవేక్షించారు. మంతెన జెడ్పీ పాఠశాల నుంచి 35 మంది క్రీడాకారులు నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం పి.రత్నకుమార్ తెలిపారు.



నియోజకవర్గస్థాయిలో సత్తా చాటిన బాలికల జట్టు క్రీడాకారులు

ముగిసిన అథ్లెటిక్స్ పోటీలు

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో శనివారం 67వ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. అండర్-14, 17 విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీలకు గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, విజయవాడ రూరల్ మండలాలకు చెందిన 200 బాలబాలికలకు పాల్గొన్నారు. తొలుత ఈ పోటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిమ్మగడ్డ రవీంద్రభవాని ప్రారంభించారు. అనంతరం రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, జావలిన్‌త్రో, డిస్కస్‌త్రో విభాగాల్లో పోటీలు నిర్వహించారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాల, బాలికలను నియోజకవర్గ జట్టుకు ఎంపిక చేసినట్లు క్రీడా సమన్వయకర్త ధనియాల నాగరాజు తెలిపారు. ఎంపికైన బాలబాలికలు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. నాలుగు మండలాల క్రీడా సమన్వయకర్తలు, పలువురు పీఈటీలు పాల్గొన్నారు.



రన్నింగ్ పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

యువతకు ఉపాధి శిక్షణ

గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లిలో ఉన్న సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(సీపెట్) సంస్థలో యువతకు పాలిమర్స్ టెక్నాలజీలో ఉపాధితో కూడిన ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సీపెట్ జాయింట్ డైరెక్టర్ అండ్ హెడ్ డాక్టర్ సీహెచ్ శేఖర్ చెప్పారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాతీయ వెనుకబడిన తరగతుల ఆర్థికాభివృద్ధి సంస్థ, జాతీయ షెడ్యూల్డ్ కులాల ఆర్థికాభివృద్ధి సంస్థ సంయుక్త సౌజన్యంతో ఓబీసీ, ఎస్సీ వర్గాలకు చెందిన 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు గల నిరుద్యోగ యువతకు పాలిమర్స్ టెక్నాలజీలో మెషిన్ ఆపరేటర్ ప్లాస్టిక్ ప్రాసెసింగ్, మెషిన్ ఆపరేటర్, అసిస్టెంట్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ కోర్సుల్లో ఆరు నెలల పాటు శిక్షణ ఉచితంగా అందిస్తామన్నారు. హైదరాబాద్, బెంగళూరు, హోసూరు, చెన్నై ప్రాంతాల్లో ఉన్న ప్రముఖ ప్లాస్టిక్ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తామని వివరించారు.

శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి, ట్రైనింగ్ కిట్, యూనిఫాం, సేఫ్టీషూస్, సీపెట్ అందిస్తుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అర్హులు విద్యార్హత, కులం, ఆదాయం, ఆధార్, రేషన్ కార్డు, 4 పాస్‌పోర్టు ఫొటోలతో సీపెట్ ప్రతినిధి కె.సుందరరావు, ఫోన్ నంబర్ 9398050255లో సంప్రదించి దరఖాస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా తీవ్ర నేరం

సీడీపీవో వెంకటలక్ష్మి

గన్నవరం రూరల్: బాల్య వివాహాలు చట్టరీత్యా తీవ్ర నేరమని ఐసీడీఎస్ గన్నవరం ప్రాజెక్టు సీడీపీవో పి.వెంకటలక్ష్మి చెప్పారు. శనివారం మండలంలోని ముస్తాబాద జెడ్పీహైస్కూల్‌లో 8,9,10 తరగతుల విద్యార్థినులకు బాల్య వివాహాల నిరోధం పై, పౌష్టికాహారం తీసుకోవాల్సిన అవసరంపై అవగాహన నిర్వహించారు.

హెచ్‌ఎం ఎంవీ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలకు 18సంవత్సరాలు నిండాలని, అప్పుడే వారిలో బుద్ధి బలం వికసిస్తుందని వివరించారు. కనీసం ఇంటర్మీడియట్ వరకూ చదవాలన్నారు. పౌష్టికాహారం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల నుండి విద్యార్థినులు చదువుకునే వరకూ అందిస్తుందని తెలిపారు. ఈ పౌష్టికాహారాన్ని నిర్లక్ష్యం చేయరాదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో అతి తక్కువ ఖర్చుతో పౌష్టికాహారం తయారు చేసే విధానాలను ప్రదర్శిస్తూ, మహిళలకు అవగాహన కల్పిస్తున్నట్లు, ఆ కార్యక్రమాలలో విద్యార్థినులు పాల్గొని తమ గృహాల్లో తల్లులకు వివరించటంతో పాటు స్వయంగా తయారు చేసుకునే అవగాహన నేర్పాలన్నారు. 18 సంవత్సరాలు నిండే వరకూ శారీరకంగా ఎదుగుదలలు ఉంటాయని, కాబట్టి ఆ వయస్సు నిండే వరకూ బాల్య వివాహాలు చేయరాదన్నారు. ఆ విధంగా ఎవరైనా చేస్తే శిక్షకు గురవుతారని హెచ్చరించారు. గన్నవరం సెక్టార్ సూపర్‌వైజర్ నాగపద్మావతి, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ జెట్టి నానారావు, హరిత, అంగన్‌వాడీ కార్యకర్తలు వనజ, అనిత, ఏసీడీపీవోలు శ్యామల, నాగరాజు, క్రాప్ జిల్లా కో-ఆర్డినేటర్ ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోస్టర్లు ఆవిష్కరించారు.



బాల్య వివాహాల నిరోధంపై పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీడీపీవో వెంకటలక్ష్మి, అధికారులు

సంక్షేమ పాలనను మళ్లీ ఆశీర్వదించండి

- సీఎం జగనన్నకు బాసటగా నిలవండి
- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

కంకిపాడు: అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి కాంక్షిస్తూ పాలన సాగిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి విజ్ఞప్తిచేశారు. మండలంలోని తెన్నేరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి సంక్షేమ బ్రోచర్లను పంపిణీ చేశారు. అంతర్గత రహదారులు, డ్రెయినేజీ, వీధిలైట్లు, తదితర సమస్యలను ప్రజలు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఆయా సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో అక్కడికక్కడే చర్చించి పరిష్కారానికి ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజల సంక్షేమం కోసమే పాటుపడుతుందని చెప్పారు. రాజకీయాలకు ఆస్కారం ఇవ్వకుండా, అర్హతను బట్టి పథకాలను వర్తింపచేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందని తెలిపారు. వలంటీరు, సచివాలయ వ్యవస్థ, పాలనలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు యావత్ ప్రపంచం రాష్ట్రం వైపు చూసేలా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పన శరవేగంగా జరుగుతుందన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న పాలనా పరమైన విధానాలతో అన్ని వర్గాలూ సంతోషంగా ఉంటే ప్రతిపక్షాలు చూసి ఓర్వలేకపోతున్నాయని తెలిపారు. ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ బురదచిమ్మే కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి పాలనను చూసి ప్రజలు ప్రతిపక్షాలకు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. సంక్షేమ పాలనను మరోసారి అధికారంలోకి తేవటానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జుజ్జువరపు ఎలీషా, ఎంపీటీసీ ఉప్పలూరి శాంతి, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, కమ్మకార్పొరేషన్ డైరెక్టర్ రామినేని రమాదేవి, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, డైరెక్టర్ బి.వాసు, సర్పంచ్‌లు లాం సోనియా, సిహెచ్ ఆదర్శకుమార్, చిప్పల రామదాసు, పి.వరప్రసాద్, వీరంకి వెంకటరమణ, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, పీఏసీఎస్ చైర్మన్‌లు వీరంకి నరేష్, పటాకుల శ్రీనివాస్, పార్టీ నాయకులు మట్టా నాగరాజు, లంక వెంకయ్య, కలపాల వజ్రాలు, ఉప్పలూరి సునీల్, ఎంపీడీఓ ఉదయభాస్కర్, తహసీల్దార్ పీఎస్వీ ప్రసాద్, పంచాయతీ ఈఓ సువర్ణలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.



తెన్నేరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పాలన వివరిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

రౌడీషీటర్‌పై బైండోవర్ కేసు

పెనమలూరు: అనుమానాస్పదస్థితిలో సంచరిస్తున్న రౌడీషీటర్‌పై పోలీసులు శనివారం బైండోవర్ కేసు నమోదు చేశారు. సీఐ వి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం .. కానూరు సనత్‌నగర్ ప్రాంతంలో రౌడీషీటర్ షేక్.అజీజుర్ రెహమాన్ అనుమానాస్పదంగా సంచరిస్తుండటంతో అదుపులోకి తీసుకున్నారు. గతంలో దాడి కేసులతో పాటు రౌడీషీటు కూడా ఉండటంతో ముందస్తు చర్యల్లో భాగంగా బైండోవర్ కేసు నమోదు చేశారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన ర్యాలీ



ఉంగుటూరు: అనారోగ్య సమస్యలను తొలి దశలోనే గుర్తించి వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశ పెట్టిందని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. వెల్దిపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లోనే వైద్య నిపుణులతో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసేందుకు వలంటీర్లు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ లాం నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

కొబ్బరిచెట్టుపై పిడుగు..తప్పిన ప్రమాదం



గన్నవరం: స్థానిక రాయ్‌నగర్‌లోని ఓ ఇంటి ఆవరణలోని కొబ్బరిచెట్టుపై పిడుగు పడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. రాయ్‌నగర్‌లోని వాతిక వాటర్ ప్లాంట్ సమీపంలోని ఇంటిలో ప్రైవేట్ టీచర్ రాజశేఖర్ కుటుంబంతో సహా అద్దెకు ఉంటున్నాడు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో రాజశేఖర్ నివాసం ఉంటున్న ఇంటి ఆవరణలో కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. పిడుగు శబ్దానికి పరిసర ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కొబ్బరిచెట్టుపై మంటలు కూడా చెలరేగాయి. పిడుగు పడిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

భోజనం ప్లేట్ల పంపిణీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచితంగా స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశారు. స్థానిక నూజివీడు రోడ్డుకు చెందిన కండెపునేని సుష్మ, అరుణ్‌కుమార్ దంపతులు కొండపావులూరి అశోక్ జ్ఞాపకార్థం 110 మంది విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు. ఏలూరురోడ్డులోని తిమ్మనవీడు ఎంపీపీ స్కూల్, రైల్వే స్టేషన్ సమీపంలోని అంధ్రేయపురం ఎంపీపీ స్కూల్, ఏపూరులోని ఎంపీపీ స్కూల్‌లో దాతల కుటుంబ సభ్యులు, మానవత సభ్యులు విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు అందించారు. మానవత జిల్లా అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు, హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కూరెళ్ల సుబ్బాచారి, కళ్లేపల్లి నారాయణరావు, కోశాధికారి పాబోలు గణేష్, సీనియర్ సభ్యులు వడ్డి రాజేశ్వరరావు, నారగాని కొండలరావు, గంటా సత్యనారాయణ, దయాల ప్రభాకరరావు, వేగిరెడ్డి సూర్యనారాయణ, చక్కా సుబ్బారావు పాల్గొన్నారు.